కథా నిలయం
1521
శ్రీకాకుళం

# న్యాయం గుడ్డిది

"నిన్ను నుంచున్నపనంగా తీసుకురమ్మన్నారుఅమ్మగారు" అన్నాడు సీతాలు పనిచేసే యింటినౌకరు వచ్చి.

అప్పుడే యింటిడి పనిచేసి తిరిగొచ్చిన సీతాలు ఆమాటలు విని ఆశ్చర్యపోయింది. చేతులో జ్వరంతో వున్న పిల్లాడు. వాడిని త్వరగా హాస్పటలికి తీసుకెళ్ళాలని బయలుదేరింది. పక్కింటి రాములమ్మ నాంచారి బయలుదేరారు సీతాలుకి సహాయంగా.

అస్పతాలకెల్లి తిరిగొచ్చాకొత్తానని సెప్పు" అంది సీతాలు.

"నీక్కాదేటి సెప్పేది యెంటనే రమ్మన్నారు" అన్నాడు నౌకరు దబాయిస్తూ.

"ఎట్టారానేటి? పిల్లోడికి బాగలేకుంటే" అంది బాధగా.

'మేంతీసుకెల్తాంలే ఆస్పతాలికి నువ్వెల్లు ఏంపనో ఏంటో" అంటూ పిల్లాడిని అందిపుచ్చుకున్నారు పక్కనున్న ఆడవాళ్ళు. నౌకరు ధోరణిచూస్తె వాళ్ళందరికి కొంచెం భయంగానె వుంది. అందుకే సీతాలు మరోసారి "ఎందుకేటి" అంది.

"నాకేటి తెలుత్తాది! నడునడు" అంటూ ఆమె జబ్బ పుచ్చుకుని బరబర లాక్కుపోడం మొదలుపెట్టాడు. సీతాలు

గింజుకోడంతప్ప మరేమి చెయ్యలేకపోయింది. పిల్లి నోటబడ్డ పిట్టలా గిలగిల్లాడుతూ పనిచేసే యింటిని సమీపించింది.

ఇంటిచుట్టూ చేరిన జనాన్నిచూసి కంగారుపడింది సీతాలు. ఆ చిన్న అమాయకపు బుర్రలో ఎంత ఆలోచించినా కారణం మాత్రం అర్థంకాలేదు బోనులోని పెద్దపులిలా అరుస్తూ అటూ ఇటు తిరుగుతోంది యింటావిడ. యజమానురాలిని చూడగానె మరింత ధైర్యమొచ్చిన నౌకరు "ఇదిగోనండి దొంగముండ" అంటూ ముందుకు ఒకతోపు తోశాడు. ఆవిడ కాళ్ళమీద వచ్చి పడింది సీతాలు బంతిలా.

"బంగారుగొలుసు ఎక్కడపెట్టావో చెప్పవే" అంటూ ఉరుములా గర్జించింది ఆవిడ.

బంగారుగొలుసేమిటో అర్థంకాని సీతాలు తెల్లబోయింది.

మెల్లిగా తలెత్తి ఆవిడకేసిచూసి మరింత భయపడి తల దించుకుంది. "నంగనాచిలా మాట్లాడవేమే?" అంది. సమాధానం రాక మరింత మండిపడుతూ. సమాధానం దొరకని సీతాలు అలాగే వుండిపోయింది. "అదే చెబుతుంది. రెండు తగలనిస్తే సరి" అన్నారు గుంపులుగా వున్న జనంలోనుంచి ఎవరో.

"ఎక్కడ పెట్టావో చెప్పమంటే మాట్లాడవేమే? నీపొగరు మండిపోను" అంది ఆవిడ మరింత ధీమాగా.

ఎలాగో అలాగ నోరు పెగల్చుకొని "గొలుసేమిటమ్మగారు అంది లేచి నిలబడిన సీతాలు.

"గదిలో పరుపుకింద పెట్టిన గొలుసు పట్టుకుపోయి యింకా గొలుసేమిటని అడుగుతున్నావా? సిగ్గులేనిదానా" అంది ఆవిడ మరింత గొంతు చించుకుంటూ.

అప్పటికి పూర్తిగా పరిస్థితి అర్థమయింది సీతాలుకి.

"నాకేం తెల్వాదమ్మగారూ. నేను పనిచేసుకుపోయినా. నా బిడ్డడు జరంతో మూల్గుతున్నాడు తల్లీ. వానిమీద వొట్టేసి సెప్తా! నన్నుపోనీ తల్లీ" అంటూ రకరకాలుగా ప్రతిమాలింది సీతాలు. మొత్తుకుంది. గుండెలు పగిలేలా యేడ్చింది.

"దవడ పగిలితేసరి అదే నిజం కక్కుతుంది. ఈ కాలం పనివాళ్ళు పనికికాదు వచ్చేది. ఇదిగో ఇలాటివి యెత్తుకెళ్ళడానికే అన్నారు కంఠాలుకలిపి మరికొందరు.

అంతవరకు చూస్తున్న యజమాని సీతాలుకు దగ్గరగావచ్చి "ఏమే! నిజం చెబుతావా తన్నమన్నావా" అంటూ చెయ్యిపైకెత్తాడు ఇంతలో నౌకరు ఆయనకు అడ్డుగా వచ్చి "మీరుండండి అయ్యగారూ ! నేను నిజం కక్కిస్తా" అంటూ ఒకచేత్తో సీతాలు జబ్బ గుంజి పట్టుకున్నాడు. మరోచెయ్యి శక్తికొలది సీతాలు దవడమీద వేశాడు. కొండమీద వజ్రాయుధం పడినంత చప్పుడయింది. నాలుగు దవడపళ్లు రాలి కిందపడ్డాయి. రక్తం బొటాబొటా కారడం మొదలుపెట్టింది. బాధ తట్టుకోలేని సీతాలు "అమ్మగారు నన్ను రచ్చించండి. నాకేపాపం తెల్వాదమ్మా" అంటూ ఆర్త నాదాలు చేస్తూనేవుంది. సాటివారి గుండెలు కరిగిపోయాయి మిగిలినవారి గుండెలు మరీ నల్లరాళ్ళైపోయాయి.

కాని సీతాలు నౌకరు చేతిలోనుండి తప్పించుకోలేకపోయింది నడుంవంచి గుద్దటం ప్రారంభించాడు. కుయ్యో మొర్రో అంటూ అరుస్తోంది సీతాలు. బాధతో మెలికలు తిరిగిపోతోంది. "దొంగ

ముండా! యింకా అరుస్తున్నావా? ఎక్కడ పెట్టావో చెప్పవేమే" అంటూ డొక్కలో కాలితో ఒక్క తన్ను తన్నాడు.

కెవ్వున ఒక్క కేకవేస్తూ మొదలు నరికిన చెట్టులా నేల కూలింది సీతాలు.

"పోలీసోళ్లు రావాలి. అప్పుడు కాని నిజం చెప్పదు" అన్నారు ఎవరో. యజమాని వెంటనే పోలీసుస్టేషనుకి బయలు దేరాడు. సీతాలుని చూసి గుండె చెదిరిన ఒక స్త్రీ పరుగెత్తుకెళ్ళి నీళ్ళబిందెతో తిరిగివచ్చి జనాన్ని తోసుకుంటు సీతాలును సమీపించింది. నౌకరు అడ్డుపెడుతున్న వినిపించుకోకుండా ముఖం మీద నీళ్లుచల్లింది. తడిబట్టతో రక్తం తుడిచింది. సీతాలు కొంచెం కదిలినట్లనిపించింది. మెల్లిగా కళ్లు తెరిచి చూచింది. దాహమని సంజ్ఞగేసింది. ఆవిడ సీతాలును కూర్చోబెట్టింది. బిందెతో మెల్లగా నీళ్లు తాగించింది. కాళీఅయిన బిందెతో పక్కకు తప్పుకుంది. జనం అదంతా వింత చూసినట్లు చూస్తున్నారు.

కొందరుమాత్రం జాలితో "పాపం నిజంగా తియ్యలేదేమో" అంటున్నారు. "నిజం దేమునికి తెలుసు అంటున్నారు మరి కొందరు. వెనకనున్న పనివాళు కొందరుమాత్రం ధైర్యంగా "వీడి జిమ్మడిపోను. వీడి చేతులు పడిపోను. వీణ్ణి దేముడెత్తుకెళ్ళా. గొడ్డును బాదినట్లే బాదేడు కదే" అంటున్నారు.

ముందువారు మాత్రం "అది తియ్యకపోతే మరెవ్వరు తీస్తారు. అదో దొంగవేషం" అని అంటూనే వున్నారు. ఆ మాటలన్నీ సీతాలు చెవులుకి ములుకుల్లా గుచ్చుకుంటున్నాయి. చెయ్యని నేరానికి శిక్ష. కళ్లు, చెవులు, మనసులేనిది న్యాయంకాబోలు" అనుకుంది సీతాలు. దుఃఖం పెల్లుబికి వస్తోంది. ఓదార్చేవారెవరు.

తనని కాపాడేవారెవరు? పిల్లవాణ్ణి ఆస్పటలులో చూపించారోలేదో? తనకోసం ఏడుస్తున్నాడేమో! తను ఈగండం గడిచి బ్రతుకుతుందా! ఈ దెబ్బలు తట్టుకోకలదా. మనస్సు వికలమైపోయింది. పుట్టిన తరువాత యేనాడు కడుపునిండా తిని యెరుగని సీతాలు దేహం గజగజా వణికిపోయింది. తిరిగి స్పృహతప్పి నేలను కరచుకుపోయింది.

ఇంతలో లాటీలు చేతపట్టి యమదూతల్లా పోలీసులు బయలుదేరి వచ్చారు. వారి వెంబడే యజమాని మహా గర్వంగా మీసాలు మెలివేస్తూ వచ్చాడు.

లాటీలు నేలమీద కొడుతూ ఆమెచుట్టూ చేరారు పోలీసులు జనంలో కుతూహలం పెరిగిపోయింది. పోలీసుల్ని అక్కడే వుంచి యినస్పెక్టర్ కాలిబూట్లు టకటకా చప్పుడుచేస్తూ ఇంట్లోకివెళ్ళాడు. గొలుసుపోయిన గదంతా పరిశీలించాడు. గొలుసు వివరాలన్నీ సేకరించాడు. ఆయింట్లో భార్యాభర్తలు పెళ్ళికాని కొడుకు తప్ప మరెవ్వరు వుండరు. ఆవిడ సాయంకాలం మెళ్ళో గొలుసు తీసి పరుపుకింద వుంచింది. ప్రొద్దుట పనిమనిషి తప్ప మరెవ్వరు లోపలికి రాలేదు. పొద్దుటే గది తుడవటానికి సీతాలు వెళ్ళింది. ఆమెతప్ప వేరేవాళ్ళు తియ్యడానికి అవకాశమేలేదు. ఆమె తీసుండాలి. ఇనస్పెక్టరుకి చెప్పలేని ఆవేశమొచ్చింది. నాలుగు తన్నితే సరి అదే నిజం చెబుతుంది అనుకున్నాడు పెద్ద పెద్ద అంగలేసుకుంటూ బూట్లు మరింత చప్పుడు చేసుకుంటూ లాటీ మరింత తిప్పుతూ సింహంలా సీతాలున్న చోటికి వచ్చాడు రెక్కపట్టి ఒక్క గుంజు గుంజి కూర్చోపెట్టాడు. కళ్ళు తెరిచిన సీతాలు ఇనస్పెక్టరునుచూచి ముడుచుకుపోయింది. ప్రైప్రాణం పైకెగిరి

పోయినట్లైంది. నౌకరు దెబ్బలతో వచ్చిముద్దలావున్న శరీరంతో పాటు అవమానంతో మనస్సు మరింత వుండైపోయింది. వారిని చూడలేక తల దించుకుని కూర్చుంది. "గొలుసు తీశావా! లేదా!" అంటూ లాటీ ఎత్తాడు ఇనస్పెక్టరు ఆజ్ఞతో కానిస్టేబుల్. దెబ్బ పడితే సీతాలు చచ్చిపోతుంది. "నాకు తెల్వదుబాబూ. నేను సూడ లేదు బాబూ. రచ్చించండి" అంటూ సీతాలు ఘొల్లుమంది.

చెయ్యి పైకెత్తి పోలీసు మీదికొస్తున్నాడు. దెబ్బ పడ బోతోంది. ఇంతలో వెనకనుంచి "ఆగు" అన్న శబ్దం వినబడింది

పోలీసు చెయ్యి అలాగే వుండిపోయింది. తలెత్తిన సీతాలు అటే చూస్తోంది. జనమంతా ఒక్కసారి మాటలు ఆపి శబ్దము వచ్చినవైపే చూస్తున్నారు.

ఆవైపునుండి ఒక స్త్రీ వచ్చి సీతాల్ని సమీపించింది. గుంపులుగా నిలబడి విడ్డూరంచూస్తూ నిలబడ్డ జనాన్ని చూసి "ఏరా! మీకు బుద్ధిలేదట్రా! ఆడమనిసిని గొడ్డును బాదినట్టు బాత్తూంటే మీకు నోరు లేదట్రా. పైగా గుడ్లు మిటకరించి సూత్తు న్నారా! మీ ఆడమనిసయితే యిట్టాగే వుండేవారా! మాట్రాడేం. అయినా మీకు మాటేమిటొత్తాది ఛీ!ఛీ!" అంటూ గ్రాడించిపక్కకు తిరిగి వుమ్మేసింది.

ఒక్కరికి నిజంగానె నోటమాట రాలేదు. ఆమె సీతాలు దగ్గర అలాగే లాఠీకర్ర పైకెత్తి నిలబడ్డ పోలీసుని పక్కకుఒక్క తోపు తోసింది. వాని చేతిలోని కర్ర కాస్తా లాక్కుంది. పోలీసు అంతదూరమెళ్ళి పడ్డాడు.

ఇనస్పెక్టరుకేసి తిరిగింది యీసారి. "ఏమయ్యా! భలే ఇనస్పెక్టరువయ్యా నువ్వు! నీ న్యాయం మండిపోను. నీకసలు బుద్దెక్కడుందయ్యా. వాళ్లు వీళ్లు చెప్పింది వినడమేతప్ప నీకసలు సొంతంగా బుర్రలేదయ్యా. అయినా అసలు నీకు కనబడనిదాన్ని చూడనిదాన్ని ఎట్టా నమ్మినావయ్యా! ఆళ్ళు చెప్పినారు నువ్వు నమ్మినావు. అసలు పోలీసులే ఇంతయ్యా ఈ రోజుల్లో అంది నదురుబెదురు లేకుండా. అర్థంకాని ఇనస్పెక్టరు తెల్లబోయి చూశాడు. అందరిదృష్టి ఆమెమీదేవుంది.

కాస్త నలిగిన సిల్కుచీర చవుకబారు సెంటువాసన, చవక రకం సగం చెరిగిన పౌడరు వేసుకున్న ముఖం, చెవులకు కాంతి తగ్గిన రాళ్ళదుద్దులు, చేతులనిండా గాజులు, వేళ్ళకు ఉంగరాలు, కాళ్ళకు మట్టెలు, మెళ్ళో నెక్లెస్, మెరుస్తున్న చంద్రహారాల గొలుసు. అసలామె ఎందుకక్కడకు వచ్చిందో ఎవరికి అర్థం కాలేదు. ఆమె యజమానురాలిని సమీపించింది. "నిజంగా దొంగ దొరికితే చావకొట్టిస్తావా" అని అడిగింది.

"కొట్టించడమే కాదు, జైల్లో పెట్టిస్తా" నంది యజమానురాలు. అటు ఇటు పరకాయించి చూసింది ఆమె. తలుపు చాటున నిలబడి తొంగిచూస్తూ తనని చూసి లోపలకు వెళ్ళిపోతున్న వ్యక్తి ఆమె కంట పడ్డాడు. ఆమె కళ్ళలో ఒక్క మెరుపు మెరిసింది. నాలుగు అడుగులేసి చటుక్కున అతని చెయ్యిపట్టి ఆపింది. "ఒదులు, ఒదు"లని అతను గించుకుంటున్న వదల లేదు. అది భల్లూకపు పట్టు. ఒక చేత్తో అతన్ని బరబరా లాక్కొచ్చి ఆవిడ ఎదురుగా నుంచోపెట్టింది. మరోచేత్తో రవికిలో దాచిన గొలుసు తీసి చూపించింది. ఆవిడకు నోటమాట రాలేదు.

ఒళ్ళు గజగజా ఒణికిపోయింది ఆ వ్యక్తిని చూడలేక తలదించుకుంది. పోలీసులు, యినస్పెక్టరుకూడా నుదురు చిట్లించారు. జనంలో చెప్పలేని అలజడి బయలుదేరింది. ఇంటి యజమాని నిలబడలేక అరుగుమీద చతికిలబడ్డాడు. "నీదేనా గొలుసు? ఇంకా సందేహమా! గుడ్లు మిటకరించి సూత్రావేం మాట్లాడు" అంటూ గద్దించింది ఆమె.

యజమానురాలికి నోట్లో మాట పెగిలి రాలేదు. ముఖంలో కత్తి వాటుకు నెత్తురుచుక్క లేదు. అర్థంకాని ఇనస్పెక్టరుకి గొలుసు దొరికాక అయోమయ్యం అయింది. ఆమె ఇనస్పెక్టరుకేసి తిరిగింది. "ఇనస్పెక్టరుగారూ! ఇప్పుడర్థమయిందా! దొంగ ఎవరో, ఇంకా అర్థంకాలేదేమో మీకు. నేనెవరో మీకు బాగా తెలుసు. నా వృత్తి అది" కాని నేనెప్పుడూ దొంగతనం చెయ్యలేదు. ఎవరిని యిలా బాధించలేదు. పెళ్ళికాని కుర్రాడు ఈ మధ్య నా చుట్టూ తిరుగుతున్నాడు. నేను చేరనియ్యలేదు. చివరకు రాత్రి యీ గొలుసు పట్టుకొచ్చి ఇచ్చారు. నేను తీసుకుని దాచివుంచాను. వీధి చివరనున్న నాకు అన్నీ తెలుస్తూనేవున్నాయి. అమాయకురాలిని నిష్కారణంగా చావకొట్టించారు. ఆ నౌకర్ని జైల్లో పెట్టించండి. మీ పోలీసోళ్ళ చేతుల్లో పడ్డ ఆడది బయటకు వచ్చి మరి బట్టకట్టదు. అందుకే పరుగెత్తుకొచ్చాను. వృత్తికి వేశ్యనయినా నాకూ హృదయముంది." అంది ఆమె. ఆమెను తెలియని వారెవ్వరు అక్కడ లేరు. ఇనస్పెక్టరు నిజంగా సిగ్గుపడ్డాడు. తల్లి గొలుసునే కాజేసి వేశ్యకి ఇస్తాడని ఎవ్వరూ వూహించలేక పొయారు.

"మా కేసుకి సహాయపడ్డారు, మీకు ఋణపడ్డాం" అన్నాడు ఇనస్పెక్టరు.

"ఋణానికేముందయ్యా! ఇదిగో యెత్తిన కఱ్ఱమాత్రం దించకు. దొంగను వదలకు" అయినా మీరు పెద్దలు మీరేమి చేసినా చెల్లుతుంది. మీ న్యాయం గుడ్డిది." అంది.

సీతాలు తిన్న దెబ్బలన్నీ అసలు దొంగ తినవలసిందే! అంతేకాదు నిర్దాక్షిణ్యంగా కొట్టిన నౌకర్ని తన్నాలి" అంటూ జనం ఆవేశంతో ముందుకు తోసుకొస్తున్నారు. వారిని అదుపులో పెట్టటానికి పోలీసులు, ఇనస్పెక్టరు ముందుకురికారు.

కొడుకు చేసిన దొంగపనికి శిక్ష లేకుండా చేయించాలని తల్లితండ్రులు సతమత మవుతున్నారు.

ఆమె సీతాలును మెల్లగా లేవదీసింది. లేవలేక లేచింది సీతాలు. మెల్లిగా నడిపించుకుంటూ వెళ్ళింది వేశ్య గాంధర్వి. అడుగు వేసింది ముందుకు సీతాలు.

(వనితాజ్యోతిలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ)